క్లుప్తంగా

భూసార పరీక్షలపై శిక్షణ



రైతులకు శిక్షణ ఇస్తున్న చిత్తూరు వ్యవసాయాధికారిని లక్ష్మీప్రసన్న

గంగాధర నెల్లూరు: భూసార పరీక్షల ప్రాముఖ్యంపై రైతులకు అవగాహన అవసరమని చిత్తూరు వ్యవసాయాధికారిని లక్ష్మీ ప్రసన్న అన్నారు. గంగాధర నెల్లూరు మండల పరిధిలోని అక్కనగారి పల్లి, జీడీ నెల్లూరు గ్రామాల్లో రైతులకు భూసార పరీక్షలు వాటి ప్రాధాన్యంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న పీఎండీఎస్, ఏపీ సీఎంఎస్ సిబ్బంది ద్వారా రైతులకు విత్తనాల సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు భవాని, నర్మదా, రైతులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలి



హౌసింగ్ లేఔట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గంగాధర నెల్లూరు: లబ్ధిదారులు వేగవంతంగా గృహాలు నిర్మించుకోవాలని ఎంపీడీఓ హరి ప్రసాదరెడ్డి సూచించారు. శుక్రవారం గంగాధర నెల్లూరు మండల పరిధిలోని పాచిగుంట పంచాయతీ గొల్లపల్లిలో నిర్మాణంలో ఉన్న హౌసింగ్ లేఔట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే చౌటూరు లో కొత్తగా నిర్మిస్తున్న పైప్‌లైన్ పనులు పరిశీలించారు. గ్రామస్తులకు నీటి సౌకర్యం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాచిగుంట పంచాయతీ కార్యదర్శి కుమార్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తులు దాడి

- వ్యక్తికి తీవ్ర గాయాలు



గంగాధర నెల్లూరు: వ్యక్తిపై దాడి జరిగి ఆసుపత్రి పాలైన సంఘటన గురువారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు మండలంలోని పెద్ద కాలువ పంచాయతీ మిట్ట దళితవాడకు చెందిన సెల్వం కుమారుడు మధురై పని ముగించుకుని గురువారం రాత్రి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని తెలిపారు. తీవ్ర గాయాలపాలైన యువకుడు మధురై చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేశారని తెలిపారు.

ఘనంగా ప్రదోష పూజలు

కాణిపాకం: త్రయోదశిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైనా శ్రీ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రదోష పూజలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్, నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం నందీశ్వరుడి పలు రకాల పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ ప్రదోష పూజలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తి ప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈవో పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్, ఇసుక దోపిడీ





గాలేరు-నగరి ప్రాంతంలో గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లు





రాజుల కండ్రిగలో మార్గంలో ఇసుకతో వేగంగా వెళుతున్న నంబరు లేని ట్రాక్టర్లు

సంపాదనే ధ్యేయంగా పచ్చమాఫియా బరి తెగిస్తోంది. అధికారం అడ్డు పెట్టుకుని ఇష్టారాజ్యంగా గ్రావెల్, ఇసుక తరలిస్తోంది. అధికారులు ఒక మార్గాన్ని మూసేస్తే మరోమార్గంలో దర్జాగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. నంబరు ప్లేటు లేని ట్రాక్టర్లలో పల్లె మార్గాల మీదుగా జోరుగా అక్రమ రవాణా సాగుతోంది. అధికారులు చోద్యం చూడటం తప్పితే వారి మీద చర్యలకు వెనుకాడుతున్నారనే విమర్శలొస్తున్నాయి.

- బరి తెగిస్తున్న పచ్చ మాఫియా
- అంతా మా ఇష్టం అనే లెవెల్లో నేతలు
- గాలేరు-నగరి ప్రాజెక్టు సమీపం గ్రావెల్ తరలింపు

నగరి: మండలంలోని అడవికొత్తూరు గ్రామ శివార్లలో గాలేరు నగరి ప్రాజెక్టు సమీపంలోని గుట్టట నుంచి గ్రావెల్‌ను పచ్చ నేతలు యథేచ్ఛగా తరలిస్తున్నారు. అధికారంలోకి ఉండటం..శివారు ప్రాంతం కావడంతో అడ్డుకునేందుకు ఎవరొస్తారనే ధైర్యంతో గ్రావెల్‌ను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రేయింబవళ్లూ ట్రాక్టర్లలో గ్రావెల్ తరలిపోతున్నా వీఆర్వోలు గానీ, సచివాలయ సిబ్బంది గానీ చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని గ్రామ ప్రజలు మండి పడుతున్నారు.

పల్లె మార్గాల్లో ఇసుక తరలింపు

మండలంలో తెరణి గ్రామ సమీపంలోని కుశస్థలి నది నుంచి ఇసుకను తరలిస్తున్న అక్రమ ఇసుక తరలింపుదారులు ఇసుక తరలించడానికి కొత్త దారులు అన్వేషిస్తున్నారు. ఒక మార్గంలో అధికారుల గస్తీ పెడితే వారు మరో మార్గాన్ని తమ పనులు కానిచ్చేస్తున్నారు. మండలంలోని రాజుల కండ్రిగ మార్గంలో నంబరు లేని గ్రావెల్, ఇసుక ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో వెళ్తూ స్థానికులను హడలెత్తిస్తున్నాయి. వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులు వీటి దూకుడు చూసి పరుగులు తీస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఈ మార్గాల్లో దృష్టి సారిస్తారా, లేదా? అనేది సందేహమే.

ఎవరికీ అనుమతులు ఇవ్వడం లేదు

గాలేరు-నగరి ప్రాజెక్టు ప్రాంతంలో గ్రావెల్ తరలించడానికి ఎవరికీ అనుమతులు ఇవ్వ లేదు. అలా తరలించే వారిపై చర్యలు తీసుకుంటాం. అలాగే పల్లె దారుల్లో ఇసుక తరలింపుపై కూడా ప్రత్యేక నిఘా పెడతాం. వారిపై చర్యలు తీసుకుంటాం. -ధనంజేయులు, ఇన్‌చార్జి తహసీల్దార్, నగరి మండలం

బీమా సద్వినియోగం చేసుకోవాలి

వెదురుకుప్పం: ప్రధాన మంత్రి జీవన జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రదాన మంత్రి జీవన జ్యోతిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పరశురామిరెడ్డి, ఏఓ నాగమణి, ఏపీఓ మీనాకుమారి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పొజిషన్ సర్టిఫికెట్ జారీలో నిబంధనలు పాటించాలి

పాలసముద్రం: మండల పరిధిలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇవ్వాల్సిన పొజిషన్ సర్టిఫికెట్‌లు నిబంధన ప్రకారం ఇవ్వాలని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. శుక్రవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 404 మందికి గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి పొజిషన్ సర్టిఫికెట్‌ల జారీలో నిబంధనలు తప్పక పాటించాలని తహసీల్దార్ కోరారు. వీఆర్‌ఓలు తప్పకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దాము, సూపర్‌వైజర్లు బాబు, వీఆర్‌ఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే చెరకులో మంచి దిగుబడి



చెరకు సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

విజయపురం: చెరకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత డాక్టర్ కెఆర్ తాగూర్ అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో తిరుపతి పెరుమాళ్లపల్లె వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా చెరుకులో మేలైన యాజమాన్యం, బెల్లం తయారీలో మెలకువలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. 2009 ఏ 107, 2006 ఏ 223, 2009 ఏ 252, 2005 టి 16, 2016 టి-7 చెరకు విత్తనాలు చిత్తూరు జిల్లాలో సాగుకు అనుకూలమైనవని, అధిక దిగుబడి, రస నాణ్యత కలిగి ఉంటుందన్నారు. చెరకును ఆశించే వివిధ చీడపీడలు-వాటి నిర్మూలన చర్యలను డాక్టర్ పి.నాగమణి వివరించారు. ముఖ్యంగా ఎర్ర కుళ్లు, వడలు తెగులు నివారణకు ట్రైకోడెర్మా అనే జీవ శిలీంధ్రాన్ని పశువుల ఎరువుతో కలిపి నాటే ముందుగా వేస్తే కొంతవరకు తెగుళ్లను నివారించుకోవచ్చని, ఈ మధ్యకాలంలో ఎక్కువగా పసుపు ఆకు తెగులు కూడా ఆశిస్తోందని, ఈ తెగులును తట్టుకునే రకాలను సాగు చేయాలని ఆమె కోరారు. అనంతరం ఏవో రజినికుమారి మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి రాజు, గ్రామీణ వ్యవసాయ అధికారులు ప్రియ, పవిత్ర, రైతులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడి మృతులకు నివాళి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, ప్రజలు



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నగరి: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు అంజని ఘటిస్తూ శుక్రవారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చనిపోయిన వారికి ఆత్మ శాంతించాలని, తీవ్రవాదుల్ని కూకటి వేళ్లతో అణిచివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్, నాయకులు బాషా, నాగరాజు, రవి, సల్మాన్, ఏఐటీయూసీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

పుత్తూరు: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమని నిరసిస్తూ శుక్రవారం స్థానిక న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతికి స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు.

ఉగ్రదాడి అమానుష చర్య

పెనుమూరు(కార్వేటినగరం): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి అత్యంత అమానుష చర్యని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయ కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రదాడిని ఖండిస్తూ శుక్రవారం రాత్రి పెనుమూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకు జై.., ఉగ్రవాదులు నశించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, క్రిష్ణారెడ్డి, మురళీ, లక్ష్మీపతి, రాజారెడ్డి, హరికృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

తొలగిన ముసుగు



ముసుగు తొలగించిన అనంతరం కనిపిస్తున్న ప్రారంభోత్సవ శిలాఫలకం

సాక్షి ఎఫెక్ట్..

పుత్తూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయం ముఖద్వారం వద్ద భవన ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఉన్న ముసుగును శుక్రవారం తొలగించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1.97 కోట్లతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కాగితాలతో మూసివేశారు. ఎన్నికలు పూర్తయి దాదాపు ఏడాది కావస్తున్నా ముసుగును తొలగించకపోవడంపై 24న సాక్షి దిన పత్రికలో 'కప్పేస్తే.. కనుమరుగైపోదు!' శీర్షికతో కథనం ప్రచురించింది. దీనిపై పుత్తూరు మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథ్ స్పందించారు. ముసుగును తొలగించారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కార్వేటినగరం: క్యాన్సర్ వ్యాధి బాధపడుతూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెంది సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కార్వేటినగరం టీవీఎం వీధికి చెందిన కె.కృష్ణారెడ్డి కుమారుడు కె.వేణు గోపాల్(48) కొన్ని సంవత్సరాలుగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆ బాధ తాళలేక గురువారం గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు, స్థానికులు కలసి కార్వేటినగరం సీహెచ్‌సీకి, ఆ తరువాత తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

విధులు బహిష్కరణ

చిత్తూరు అర్బన్: కశ్మీర్‌లో ముష్కరులు భారతీయులపై కాల్పులు జరిపి, హత్యలు చేయడాన్ని నిరసిస్తూ చిత్తూరులో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. ఉగ్రవాద చర్యలను తప్పుపడుతూ శనివారం కూడా విధులను బహిష్కరించాలని బార్ అసోసియేషన్ తీర్మానించింది. ఉగ్రవాదుల ఏరివేతకు కేంద్రం కఠినంగా వ్యవహరించాలని బార్ నేతలు డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పుత్తూరు: పట్టణంలోని రాచపాళ్యెంలో శుక్రవారం క్షత్రియ సంఘం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. తిరుపతి వాసన్ ఐ కేర్ హాస్పిటల్ బృందం ఈ శిబిరంలో వంద మందికి పైగా రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి 45 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసింది. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, విజయ డెంటల్ సిబ్బంది పలువురికి బీపీ, షుగర్, గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రాజు, నాయకులు డాక్టర్ రవి రాజు, శోభారాజు, శరత్‌కుమార్‌రాజు, శివకుమార్ రాజు, బాలసుబ్రమణ్యంరాజు, రామచంద్రరాజు, అంజనరాజు, రాచపాళెం వైద్యశాల డాక్టర్లు, కృష్ణమ రాజు, ప్రతాప్‌రాజు, ప్రకాష్‌రాజు, చరణ్, విజయలక్ష్మి, కాత్యాయిని, ద్రాక్షాయణి, జానిషి, సుబ్బులమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

అక్రమ కులధ్రువీకరణ పత్రాలు అరికట్టాలి



తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం ఇస్తున్న వన్నెకుల క్షత్రియ నాయకులు



తహసీల్దార్‌తో చర్చిస్తున్న వన్నెకుల క్షత్రియ డైరెక్టర్లు

కార్వేటినగరం: అగ్రకులస్తులు కొంత మంది అక్రమ కుల ధ్రువీకరణ పత్రాలతో లబ్ధి పొందుతున్నారని వన్నెకుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు శుక్రవారం మండల తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. మండలంలో వన్నెకుల క్షత్రియ కులానికి వెన్నెరెడ్డి, వన్నెకాపు అనే పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేసుకుని అక్రమంగా ధ్రువ పత్రాలు పొందుతున్నారని, అలాంటి వారికి వన్నెకుల క్షత్రియ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలను కట్టడి చేయండి

నగరి: వన్నెకుల క్షత్రియులకు సంబంధించిన నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలను కట్టడి చేయాలని రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్లు తహసీల్దార్ ధనంజయులుకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. రిజిస్టర్ కుల సంఘం నుంచి వచ్చిన వారికి మాత్రమే కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని ఆయనను కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రతి అంశాన్నీ పరిశీలించిన తర్వాతే కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నట్టు చెప్పారు.

13న కంచి గరుడ సేవను ఘనంగా నిర్వహించరూ!



ఏఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఆలయ సలహా సభ్యులు, భక్తులు

నగరి: పట్టణ పరిధి టీటీడీ ఆధీనంలోని శ్రీ కరియ మాణిక్యస్వామి ఆలయంలో కంచి గరుడ సేవ ఉత్సవాన్ని వచ్చే నెల 13న ఘనంగా నిర్వహించాలని ఆలయ సలహా సభ్యులు, స్థానిక భక్తులు అధికారులను కోరారు. శుక్రవారం ఆలయ పర్యవేక్షణకు విచ్చేసిన ఏఈఓ రవి, సూపరింటెండెంట్ శంకర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. ఈ ఉత్సవానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు, మంగళ వాయిద్యాలు, కోలాట, సాంస్కృతిక ప్రదర్శనలు, ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ చేయాలని కోరారు. దీనిపై ఏఈఓ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, గుణశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు ధన్వంతరి ఆచార్యులు, నరసింహమూర్తి, సిబ్బంది, ఆలయ సేవా సభ్యులు పాల్గొన్నారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు





ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, వడమాలపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ చక్రపాణి, సిబ్బంది



కత్తెరపల్లిలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రజలు మలేరియా వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. శుక్రవారం జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా వెంగళరాజకుప్పం సచివాలయ ఆవరణలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళీ సమక్షంలో ఆరోగ్య సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరం: దోమల ద్వారా వ్యాపించే మలేరియాను పూర్తిగా నిర్మూలించుకోవాలని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ భువనేశ్వరీ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కత్తెరపల్లిలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, డ్రై డేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ గౌరీ, పర్యవేక్షకులు త్యాగు, చంద్రవల్లి, మీనా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వడమాలపేట (విజయపురం): ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వడమాలపేట మండలంలో డాక్టర్ చక్రపాణి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ, దోమకాటు ఆరోగ్యానికి చేటు అని, నీటి నిల్వలను ఉంచరాదన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి కావలి వీధి, వడమాలపేట బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్, సీహెచ్‌ఓ పురుషోత్తం రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విజయపురంలో....

మండల కేంద్రం విజయపురం పీహెచ్‌సీ అధికారులు ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీని బస్టాండు వరకు నిర్వహించారు. డాక్టర్ విష్ణుప్రియ మాట్లాడారు. దోమ కాటు వల్లే మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతరకమైన వ్యాధుల బారిన పడతారని, ప్రతి ఒక్కరూ డ్రై డే పాటించాలన్నారు. రాత్రి పూట దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిండ్రలో..

నిండ్ర: ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని నిండ్రలో వైద్యాధికారి వినిషా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్‌ఓ శ్రీదేవి, సిబ్బంది సురేష్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



విజయపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ విష్ణుప్రియ, సిబ్బంది



నిండ్రలో..

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి, నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప పేర్కొన్నారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో క్రిష్ణమ్మపురం యూనిట్‌లోని గ్రామ సంఘం సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప.. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో జీవామృతం కషాయాల తయారీపై అవగాహన కల్పించారు.